


వాస్తవాలు పలుకు DD9
# వార్త
తెలుగు దినపత్రిక
శనివారం 30-05-2026





# విధ్వంసకర డీసిల్టింగ్ విధానాన్ని నిలిపివేయాలి

- భారీ యంత్రాలతో నదీ పర్యావరణం నాశనం చేస్తున్నారంటూ
- భద్రాచలం–పేరూరు జాతీయ రహదారిపై సిపిఎం రాస్తారోకో
- కోర్టు నిలిపివేసిన ప్రాజెక్టు పేరుతో సర్వేలు విడ్డూరం
- బడా కాంట్రాక్టర్లకు ఇసుక దోపిడీకి ప్రభుత్వం సహకారం అంటూ విమర్శ
- లక్షల కోట్ల ఇసుకను తరలించే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- పోలవరం బ్యాక్ వాటర్‌తో ఏజెన్సీకి ముప్పు
- గిరిజన సొసైటీలకే ఇసుక తవ్వకాల హక్కులు ఇవ్వాలన్న డిమాండ్
- పేసా చట్టాన్ని గౌరవించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి
- స్థానికుల ఉపాధి దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలి
- డీసిల్టింగ్ రద్దు కాకపోతే భారీ ఉద్యమం చేపడతాం

**వెంకటాపురం,మే29,(డిడి9 వార్త):**

ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గోదావరి నదిలో డీసిల్టింగ్ పేరుతో జరుగుతున్న కార్యకలాపాలు పర్యావరణానికి తీవ్ర ముప్పుగా మారుతున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. డీసిల్టింగ్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భద్రాచలం-పేరూరు జాతీయ రహదారిపై సిపిఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ ఆందోళనకు తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా బండారు రవికుమార్ మాట్లాడుతూ, సీతారామ ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పేరుతో గోదావరి నదిలో భారీ స్థాయిలో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం మార్గం సుగమం చేస్తోందని ఆరోపించారు. పర్యావరణ అనుమతులు లేకపోవడంతో కోర్టు నిలిపివేసిన సీతారామ ప్రాజెక్టు పేరును ఉపయోగించి ఏజెన్సీ మండలాల్లో అధికారులు డీసిల్టింగ్ సర్వేలు చేపట్టడం ఆశ్చర్యకరమన్నారు.

భారీ యంత్రాలతో గోదావరి నది గర్భాన్ని విచ్ఛిన్నం చేస్తూ నదీ పర్యావరణ వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. డీసిల్టింగ్ పేరుతో లక్షల కోట్ల రూపాయల విలువైన ఇసుకను బడా కాంట్రాక్టర్లకు అప్పగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంతో ఇప్పటికే ఏజెన్సీ ప్రాంతాలు ముప్పును ఎదుర్కొంటున్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో డీసిల్టింగ్ చర్యలు మరింత ప్రమాదకరమని పేర్కొన్నారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, పర్యావరణాన్ని బ్రతీయని విధానాల్లోనే ఇసుక రవాణా చేపట్టాలని సూచించారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజనుల ఉపాధికి భంగం కలగకుండా, స్థానికంగా నమోదు అయిన గిరిజన సొసైటీలకే ఇసుక తవ్వకాల హక్కులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేసా చట్టం, షెడ్యూల్ ప్రాంతాల గిరిజన హక్కులను కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం గౌరవించాలని కోరారు.

స్థానిక సొసైటీలను నిర్వీర్యం చేసి బడా కాంట్రాక్టర్లకు లాభాలు చేకూర్చే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. అడవులు, కొండలను ప్రైవేటు పరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. గోదావరి నదిని ధ్వంసం చేసే విధంగా డీసిల్టింగ్ పనులు కొనసాగితే ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిసి భారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను ప్రభుత్వం గౌరవించాలని, విధ్వంసకర డీసిల్టింగ్ విధానాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి. రెడ్డి సాంబశివ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రత్నం రాజేందర్, దావుద్, పొదిళ్ల చిట్టిబాబు, మండల కార్యదర్శి గ్యానం వాసు, నాయకులు చిట్టిం ఆదినారాయణ, కుమ్మరి శీను తదితరులు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు లక్ష్మణరావు, ఆత్మకూరు పట్టాభి, సాంబం తదితరులు కూడా ఆందోళనకు మద్దతు తెలిపారు.



# కమలాపురం గ్రామపంచాయతీలో దారుణ పరిస్థితి – హెల్త్ సెంటర్ పక్కనే మేకల అవశేషాలు, దుర్వాసనతో రోగుల ఇబ్బందులు

**మంగపేట మే 29 డీడీ 9 వార్త**

ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురం గ్రామ పంచాయతీ ఆవరణం పక్కన ఉన్న చికెన్ సెంటర్ వద్ద తీవ్ర అస్వచ్ఛత నెలకొంది. హెల్త్ సెంటర్‌కు ఆనుకుని ఉన్న ప్రదేశంలో మేకలను కోసి వాటి తోలు, మాంసాహార అవశేషాలను అక్కడికక్కడే వదిలివేయడంతో దుర్వాసన తీవ్రంగా వ్యాపిస్తోంది. స్థానిక ప్రజలు మరియు చుట్టుపక్కల నివాసితులు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హెల్త్ సెంటర్‌కు వచ్చే రోగులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.



దుర్వాసన కారణంగా చికిత్స అందించడం కూడా కష్టంగా మారిందని వారు పేర్కొన్నారు. ప్రజారోగ్యానికి ముప్పుగా మారిన ఈ పరిస్థితిపై గ్రామపంచాయతీ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులు వెంటనే స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ మాంసం వ్యర్థాలను బహిరంగంగా పడేస్తున్న చికెన్ షాప్ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిసరాలను శుభ్రం చేయించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోకపోతే ప్రజలు ఆందోళనకు దిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

# పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను యజమానికి అప్పగించిన మంగపేట పోలీసులు

**మంగపేట మే 29డీడీ 9వార్త**

మంగపేట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను గుర్తించి అసలు యజమానికి అప్పగించిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది.

కమలాపూర్ గ్రామానికి చెందిన చింతనిప్పుల రవీందర్ ఈ నెల 9వ తేదీన తన మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్లు మంగపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు CEIR సాంకేతిక విధానంతో మొబైల్ ఫోన్‌ను ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్నారు.

ఈ కేసు దర్యాప్తును ఎస్ఐ టీవీఆర్ సూరి పర్యవేక్షించగా, PS లెవెల్ CEIR ఆపరేటర్ ఎన్. సురేష్ (PC 205) ప్రత్యేక చర్యలు తీసుకుని ఫోన్‌ను గుర్తించారు. అనంతరం శుక్రవారం రోజున మొబైల్ ఫోన్‌ను అసలు యజమాని చింతనిప్పుల రవీందర్‌కు పోలీసులు అధికారికంగా అప్పగించారు.





పోగొట్టుకున్న ఫోన్‌ను తిరిగి పొందడంతో బాధితుడు మంగపేట పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

# బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఇంచార్జ్‌ని కలిసిన స్వామి వివేక్ పటేల్

**డిడి9వార్త / పెద్దపల్లి మే 30:**

పెద్దపల్లి నియోజకవర్గానికి భారత రాష్ట్ర సమితి పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జ్‌గా నూతనంగా నియామకం పొందిన ఎమ్మెల్సీ పరిపాటి వెంకటరామి రెడ్డి (ఐఏఎస్ రిటైర్డ్)ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడం, గ్రామ స్థాయిలో పార్టీ కార్యకర్తలను మరింత చైతన్యపరిచే అంశాలపై చర్చించినట్లు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ దిశనిర్దేశం చేసినట్లు ఆకుల స్వామి వివేక్ పటేల్ తెలిపారు.



# రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛత సందేశం

- ఎన్‌టీపీసీ–ఎస్సీఆర్ ఆధ్వర్యంలో నుక్కడ్ నాటక్
- స్వచ్ఛ భారత్ లక్ష్యానికి ప్రజల భాగస్వామ్యం అవసరం
- ముఖ్య అతిథిగా ఈడీ చందన్ కుమార్ సమంతా




**పెద్దపల్లి బ్యూరో, మే 29 (డిడి9 వార్త):**

రామగుండం రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమాల సందర్భంగా ఎన్ టి పి సి, సౌత్ సెంట్రల్ రైల్వే సంయుక్త ఆధ్వర్యంలో నుక్కడ్ నాటక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల్లో పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. జెమ్ బాలికలు సామాజిక సందేశాలతో కూడిన ప్రదర్శనల ద్వారా ప్రజలను ఆకట్టుకున్నారు. ప్రజా ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి పౌరుడి బాధ్యత అని వారు సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఎన్ టి పి సి ఈడీ చందన్ కుమార్ సమంతా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హెచ్ఓహెచ్ఆర్ సాగర్ రంజన్ సాహూ, హెచ్ఆర్ బృందం, ఎంఏజీఆర్ మరియు ఎఫ్ఎం విభాగాల అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ లక్ష్య సాధనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అధికారులు పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో పరిశుభ్రతపై చైతన్యం పెంచుతాయని తెలిపారు.



# మండలగూడెంలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

**జనగామ మే 29(డిడి 9 వార్త ) బ్యూరో**

మండలగూడెం గ్రామంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ మందకొడిగా సాగుతుండటంపై రైతులు, ప్రజాప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించడానికి సమయం దగ్గరపడుతున్నప్పటికీ ఇప్పటివరకు 30 శాతం ధాన్యం కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. రైతుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి రైతుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని ఆరోపిస్తూ మండలగూడెం గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పుప్పాల వేణుకుమార్, టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతల బాలకృష్ణ, టీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు తోట నరేష్, వార్డు సభ్యుడు గాదె ఉపేందర్‌తో పాటు పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# మంగపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ కేసుల ఛేదన – ఎనిమిది మంది నిందితుల అరెస్ట్

**మంగపేట మే 29డీడీ 9 వార్త**

ములుగు జిల్లా మంగపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల గ్రామాల్లో వరుసగా జరుగుతున్న చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. మంగపేట గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు కలిసి రాత్రి సమయాల్లో ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చోరీలకు పాల్పడిన వారు మంగపేట, కమలాపురం, నిజాంపల్లి ప్రాంతాలకు చెందిన వారిగా పోలీసులు తెలిపారు.

పోలీసుల కథనం ప్రకారం, గ్రామాల్లో జనాలు పనుల నిమిత్తం బయటకు వెళ్లిన సమయంలో లేదా రాత్రివేళల్లో ఇళ్లలోకి చొరబడి బంగారు ఆభరణాలు, నగదు తదితర వస్తువులను అపహరిస్తూ వచ్చినట్లు వెల్లడైంది. ఈ నేపథ్యంలో మంగపేట పోలీసులు దర్యాప్తు చేపట్టి మొత్తం ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు.

అరెస్టు చేసిన నిందితులలో కమలాపురం గ్రామానికి చెందిన నిమ్మల వినయ్ కుమార్, పరమాత్ముల శివ, నిమ్మల కుమార్, భూక్య ప్రవీణ్ అలియాస్ బెన్జ్, ఒడిశా కాలనీకి చెందిన బోయి పరశురాం, మహమ్మద్ బిలాల్, అలాగే కొనుగోలు దారులుగా వ్యవహరించిన రాయరాకుల సరయ్య, బండి తరుణ్ ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నిందితుల వద్ద నుండి
1½ తులాల బంగారం
240 తులాల వెండి వస్తువులు
రెండు బైకులు
రూ.10,000 నగదు
30 కోడి పుంజులు
మూడు సెల్ ఫోన్లు
స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ సుబ్బరాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు డీఎస్పీ నాయకత్వంలో పనిచేసిన మంగపేట సీఐ, ఎస్సైలు, సిబ్బందిని అధికారులు అభినందించారు.



# భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న రాష్ట్ర హౌజింగ్ బోర్డు ఎండీ వీపీ గౌతమ్

**భద్రాచలం , మే 29 ,**

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని రాష్ట్ర హౌజింగ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, వైదిక సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో మూలవరులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే లక్ష్మీతాయారు అమ్మవారిని, దాసాంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం వీపీ గౌతమ్‌కు వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది అందజేశారు. అలాగే వీపీ గౌతమ్ కుమారుడికి నామకరణం కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు దనియాల వెంకటేశ్వర్లు, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా పాల్గొన్నారు. కాగా వీపీ గౌతమ్ భద్రాచలం ఐటీడీఏ పీవోగా, ఖమ్మం కలెక్టర్‌గా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పని చేసారు.



# కాలువపై అక్రమ నిర్మాణాలు తొలగించాలి

- **టీచర్స్ కాలనీలో పనులు వెంటనే ప్రారంభించాలన్న మేయర్**

**పెద్దపల్లి బ్యూరో, మే 29 (డిడి9 వార్త):**

టీచర్స్ కాలనీ పరిధిలో కాలువపై ఉన్న అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించి వరద కాలువ నిర్మాణ పనులు ప్రారంభించాలని రామగుండం మేయర్ మహంకాళి స్వామి అధికారులను ఆదేశించారు.

శుక్రవారం నగర పాలక సంస్థ ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళికా విభాగం అధికారులతో కలిసి టీచర్స్ కాలనీ, శ్రీనగర్ కాలనీలను ఆయన పరిశీలించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వరద నీటి ప్రవాహానికి ఎలాంటి అంతరాయం కలగకుండా తక్షణమే పనులు ప్రారంభించాలని సూచించారు.

డీఎంఎఫ్‌టీ నిధులతో రూ.4 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన ఈ కాలువ నిర్మాణ పనులు త్వరగా పూర్తైతే వర్షాకాలంలో వరద ముంపు సమస్య తగ్గుతుందని తెలిపారు.

పనుల ప్రారంభోత్సవ సమయంలో ఎమ్మెల్యే ఇచ్చిన ఆదేశాల మేరకు కాలువపై ఏర్పడిన ఆక్రమణలను తొలగించాల్సిందేనని స్పష్టం చేశారు. శనివారం నుంచే పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వడ్లూరి రవి, గట్ల రమేష్, చిదురాల నాగరాజు, బాలసాని తిరుపతి, టి పి ఎస్ నవీన్, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలి

- **అడ్వాన్స్‌డ్ ట్రామా సెంటర్ ఏర్పాటు చేయాలి**
- **సీపీఎం ఆధ్వర్యంలో ఆసుపత్రి సమస్యలపై సర్వే**
- **సమస్యలు పరిష్కరించకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తాం: ఎం.బి. నర్సారెడ్డి**



**భద్రాచలం, మే 29 డిడి9 వార్త**

పేదోడి వైద్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి సిబ్బందిని కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బి నర్సారెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం బి నర్సారెడ్డి మాట్లాడుతూ నాలుగు రాష్ట్రాల కేంద్రంగా ఉన్న భద్రాచలం ఏరియా హాస్పిటల్ లో 42 మంది వైద్యులు అవసరం కాగా కేవలం 20 మంది మాత్రమే ఉన్నారన్నారు. అంతేకాకుండా ఇతర వైద్య సిబ్బంది సైతం లేక రోగులు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని, ప్రతిరోజు వచ్చే ఓపి పేషెంట్ల సంఖ్య సుమారు 400 వరకు ఉండగా చాలీచాలని సిబ్బందితో అంతమందికి వైద్య సేవలు అందించడం వైద్య బృందానికి కూడా సాధ్యం కావడం లేదన్నారు. జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్న భద్రాచలం శాసన సభ్యులు స్వయాన వైద్యుడు అయినప్పటికీ ఏరియా ఆసుపత్రిలో వైద్యం అందని ద్రాక్షాల మిగిలిపోతుందని నర్సారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ సిబ్బందికి ప్రతినెల వేతనాలు అందక ఆకలితో పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో సిపిఐఎం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, 20వ వార్డు సభ్యులు అనసూయ. పారిల్లి సంతోష్ కుమార్. డి సీతాలక్ష్మి

నాదెండ్ల లీలావతి, ధనకొండ రాఘవయ్య, కనక శ్రీ పాల్గొన్నారు.

# రైతులు ఆందోళన చేస్తే కేసులు పెట్టించిన దుర్మార్గుడు దుద్దిళ్ల శ్రీధర్

- **బీఆర్ఎస్..బీజేపీలవి రాజకీయాలనడం విడ్డూరమే**
- **40ఏండ్లుగా అధికారం ఇస్తే మా గురించి ఏనాడు ఆలోచన చేయలే**
- **ధాన్యం కొనుగోళ్లపై మంథని ఎమ్మెల్యే కళ్లు తెరువాలే**
- **మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



**కాటారం మే 29 ( డిడి 9 వార్త )**

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయడం లేదని, లారీలు వస్తలేవంటూ రైతులు రోడ్డెక్కి గగ్గొలు పెడితే పాలకులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాడు..కాటారం మండలం రేగులగూడెం లోని శ్రీరుద్ర జిన్నింగ్ మిల్ గోదాంలో మూడు రోజులుగా అన్లోడింగ్ కొరకు వెయిటింగ్ లో ఉన్న లారీలను, గుమ్మళపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి ఆయన శుక్రవారం నాడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంథని నియోజవకర్గంలో ఓ వైపు రైతులు వడ్లు కొంటలేరని ఆందోళన చేస్తుంటే మరోవైపు బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన రివ్యూలో రైతులకు ఎలాంటి సమస్యలు లేవని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ మాట్లాడుతున్నాడని ఆయన విమర్శించారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతుల పక్షాన నిలబడితే బీఆర్ఎస్, బీజేపీ పార్టీ కావాలనే రాజకీయం చేస్తున్నాయనడం విడ్డూరంగా ఉందన్నారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ కళ్లు తెరిపించడానికే ప్రత్యక్షంగా ఇక్కడకు వచ్చామని, పోసిరెడ్డి అనే రైతు తన వడ్లు 50 రోజుల తర్వాత కూడా కాంటాకు నోచుకోకుండా కవర్లు కప్పుకుని ఉంటున్నడని ఆయన వివరించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం, మంథని ఎమ్మెల్యే కళ్లు తెరువాలని డిమాండ్ చేశారు. మంథని ఎమ్మెల్యే స్వయనా రైతు కాకపోవడం, ఆ కుటుంబానికి ఈ ప్రాంతానికి ఎలాంటి సంబంధం లేకపోవడంతో రైతులను, ప్రజలను పట్టించుకోవడం లేదని, దుద్దిళ్ల కుటుంబానికి ఈ ప్రాంత ప్రజలతో కేవలం ఓట్ల సంబంధం మాత్రమే ఉండటం మూలంగా ఈ దుస్థితి నెలకొందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఏం చేసిందని మాట్లాడుతున్నారని,ఇదే గుమ్మళ్లపల్లి గ్రామంలో మూడు వేల ఎకరాలకు రైతుబందు ఇచ్చి ఆదుకున్నమని ఆయన గుర్తు చేశారు. తాము ఏనాడు రాజకీయం చేయలేదని, రెండున్నర ఏండ్ల తర్వాత పని చేయకుండా ప్రజల పక్షాన ఆలోచన చేయకుండా చిత్రగుప్తుడిలా 420హామీలతో దొంగ మానీఫెస్టో రాసి మమ్మల్ని దోషులుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. దేశానికి జవాన్ ఎలా రక్షణగా ఉంటడో రైతు కూడా దేశానికి అన్నం పెట్టడానికి అనునిత్యం తన రక్తాన్ని దారపోస్తడని, అనేక ఇబ్బందులు పడి ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతును జవాన్‌తో పోల్చిన విషయాన్ని మంథని ఎమ్మెల్యే గుర్తించాలన్నారు. తడిసి ముద్దయిన వడ్లను కొంటమని రైతులకు భరోసా ఇచ్చి ఈనాడు పూర్తిగా వడ్లు కొనకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. దుద్దిళ్ల కుటుంబానికి అన్నం పెట్టిన మండలం కాటారమని, కాటారం మండల ప్రజలు ఎప్పుడు ఎన్నికలు వస్తే అప్పుడు వేల ఓట్ల మెజార్టీ ఇచ్చి అందలం ఎక్కిస్తుండ్లన్నారు. 40ఏండ్లుగా అధికారం ఇస్తే అమెరికా పోయి వేల కోట్లు సంపాదించుకుంటున్నారని, అయినా ఈ కాటారం మండల ప్రజల గురించి ఆలోచన చేయడంలేదని, మా పిల్లల భవిష్యత్ గురించి మాట్లాడరని, తాము మాట్లాడితే అపవాదులు వేస్తున్నారని అన్నారు. ప్రత్యక్షంగా ఇక్కడే ఉండి మాట్లాడుతున్నామని కేంద్రానికి వచ్చి చూడాలని డిమాండ్ చేశారు. కొండంపేట పత్తి మిల్లుకు వెళ్తే అక్కడ నాలుగు రోజులుగా అన్‌లోడ్ కాకుండా లారీలు నిలిచిపోయి ఉన్నాయన్నారు. కాంటా పెట్టే సమయంలో మూడు నాలుగు కిలోల కటింగ్ పెడుతున్నారని, ఇలాంటి పరిస్థితులు ఎప్పుడు లేవన్నారు. ఈ ప్రాంతంతో సంబంధం లేకపోయినా మూడు ఓట్లు ఉన్న కుటుంబానికి 40ఏండ్లు అధికారం ఇచ్చిండ్లని గ్రహించాలన్నారు. దుద్దళ్ల శ్రీధర్ మీ తమ్ముడిని కల్లాల కాడికి ఎందుకు పంపిస్తలేవని ప్రశ్నించారు. పదవి ఇచ్చారు కదా ఎందుకు రావడం లేదో సమాజానికి సమాదానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక్కడ ఇద్దరికి ఉద్యోగాలు ఇవ్వలేదని, రెండు ఇండ్లు ఇవ్వక పోగా కనీసం ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొంటలేరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల కష్టాలు చూసి మాట్లాడుతుంటే తిడుతున్నమని బదనాం చేస్తున్నారని అన్నారు. గౌరయ్య తన చెప్పుతో తాను కొట్టుకుంటే ఆ కుటుంబంపై దాడులు చేశారని, చేసిన తప్పుకు మేమే కొట్టుకుంటున్నమని రైతులు అంటున్నారని, కానీ ఆ పరిస్థితి మీకు రాకుండా చూసుకోవాలని ఆయన హితవు పలికారు.

**అతిత్వరలో జైలు భరోకు శ్రీకారం చుడుతాం...**

కాటారం సబ్ డివిజన్ పోలీసులు అతిగా చేస్తున్నారని అతిత్వరలో జైలుభరో కార్యక్రమానికి శ్రీకారం చుడుతామని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ హెచ్చరించారు. మంథనిలో మొదలు అయితది అనుకున్నాం కానీ కాటారంలో నే మొదలుపెడుతామన్నారు. రైతుల కోసం పోరాటం చేసిన బీఆర్ఎస్ నాయకులపై మీరు కేసులు పెట్టించి చిత్రహింసలకు గురి చేస్తా ఉన్నరన్నారు. ఖబర్ధార్ కాటారం పోలీసుల్లారా ఎంతమంది మీద కేసులు పెట్టుకుంటరో పెట్టుకోండని అన్నారు. అతిత్వరలో కాటారం పోలీస్‌స్టేషన్‌కు బీఆర్ఎస్ పార్టీ నాయకులంతా వస్తం ఎంతమందిపై కేసులు పెట్టి ఏ జైలుకు పంపిస్తరో పంపించడని అన్నారు. ప్రతిపక్షంగా ప్రజల పక్షాన మాట్లాడుతుంటే మా నాయకులపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్న పోలీసుల చిట్టా రాసిపెడుతున్నామని, ప్రతి పేరును పింక్‌బుక్‌లో రాసుకుని మా ప్రభుత్వం రాగానే అమలు చేస్తమని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట భూపాలపల్లి జడ్పి మాజీ చైర్మన్ శ్రీహర్షిణి, బీఆరెస్ రాష్ట్ర నాయకుడు రాకేష్, కాటారం సర్పంచ్ సదువలి, శ్రీలక్ష్మి చౌదరి, నాయకులు, రైతులు ఉన్నారు.

# ఉద్యమకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వ అధికారిక కమిటీని ఆహ్వానిస్తున్నాం

- తెలంగాణ ఉద్యమకారులందరిని ప్రభుత్వం గుర్తించాలి.
- తెలంగాణ జేఏసీ ములుగు జిల్లా కన్వీనర్: చాప బాబుదొర



**గోవిందరావుపేట, మే 29 (డి డి 9 వార్త)**

మండలంలోని పీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి తెలంగాణ ఉద్యమకారుల పోరాట జేఏసీ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ములుగు జిల్లా కన్వీనర్ చాప బాబుదొర పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారిక ఆరుగురు సభ్యుల కమిటీని స్వాగతిస్తున్నామని తెలిపారు.

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడిని ప్రభుత్వం అధికారికంగా గుర్తించాలని, తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు జిల్లా కేంద్రాలలో ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాలను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రతి ఉద్యమకారుడికి రాష్ట్ర సమరయోధుల పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమ నిరాహార దీక్ష డెన్ ఇంచార్జ్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు దళిత రత్న నెమలి నర్సయ్య మాదిగ, ప్రజా సంఘాల జేఏసీ ములుగు జిల్లా కన్వీనర్ ముంజల బిక్షపతి గౌడ్, తెలంగాణ జేఏసీ కోఆర్డినేటర్లు కొత్త సుధాకర్ రెడ్డి, ఆదివాసి నాయక పోడ్ దెబ్బ వ్యవస్థాపక అధ్యక్షులు దబ్బా సుధాకర్ నాయకపోడ్, బూర నరేందర్ గౌడ్, జంపాల చంద్రశేఖర్, పిన్నింటి మధుసూదన్ రెడ్డి, లాకవత్ చందూలాల్, రేండ్ల సంతోష్, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు ఇరుగుపైడి మాదిగ, పెండెం హేమాద్రి, పొలిటికల్ జేఏసీ యూత్ జిల్లా కన్వీనర్ కత్తెరపల్లి భాస్కర్, తాడ్వాయి మండల జేఏసీ కన్వీనర్ పత్తి గోపాల్ రెడ్డి, కాక సమ్మయ్య దొర, తక్కలపల్లి దేవేందర్ రావు, ఏనుగు రవీందర్ రెడ్డి, మినదుల వెంకన్న, బొనగాని సారయ్య గౌడ్, మద్దినేని తేజ రాజు, సన్నగుండ్ల వెంకన్న, బానోతు గోపీచంద్, బండారి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# చేరుకూరు–ధర్మవరం రహదారికి అటవీశాఖ అనుమతులు ఇవ్వాలి

- గ్రామపంచాయతీల్లో తీర్మానాలు చేసి ఉన్నతాధికారులకు పంపాలని సర్పంచ్‌లకు వినతిపత్రాలు
- అటవీశాఖ అభ్యంతరాలతో 3 కి.మీ రహదారి పనులు నిలిచిపోయాయని ఆరోపణ
- రహదారి దెబ్బతిని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సిపిఎం ఆవేదన
- ప్రభుత్వం స్పందించి రహదారి నిర్మాణం పూర్తి చేయాలని విజ్ఞప్తి



**వాజేడు మే 29 (డిడి9 వార్త):**

ములుగు జిల్లా వాజేడు మండల సమీపం లోని చేరుకూరు-ధర్మవరం ఆర్ & బి రహదారి నిర్మాణానికి అటవీశాఖ వెంటనే అనుమతులు ఇవ్వాలని, సంబంధిత గ్రామపంచాయతీల్లో తీర్మానాలు చేసి ఉన్నతాధికారులు, జిల్లా మంత్రి, అటవీశాఖ చైర్మన్ మరియు ఇతర ప్రజాప్రతినిధులకు పంపించాలని కోరుతూ ధర్మవరం, అయ్యవారిపేట, చింతూరు, పేరూరు, చేరుకూరు గ్రామపంచాయతీ సర్పంచ్‌లకు సిపిఎం నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతిరావు మాట్లాడుతూ, రహదారి నిర్మాణానికి అటవీశాఖ అధికారులు అభ్యంతరాలు తెలపడంతో పనులు నిలిచిపోయాయని తెలిపారు. రహదారి నిర్మాణం ఆగిపోవడంతో గుంతలు ఏర్పడి రహదారి పూర్తిగా ధ్వంసమైందని, బస్సులు, ఆటోలు, అంబులెన్సులు మాత్రమే కాకుండా కనీసం మోటార్ సైకిళ్లు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

సుమారు 3 కిలోమీటర్ల పరిధిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అనేక ప్రమాదాలు జరిగినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. 2021 సంవత్సరంలో ఎల్‌డబ్ల్యూఈ నిధుల కింద రూ.13 కోట్లు మంజూరు కాగా, మిగతా రహదారి పనులు పూర్తయ్యాయని, కేవలం 3 కిలోమీటర్ల మేర మాత్రమే అటవీశాఖ అభ్యంతరాలతో ఆగిపోయిందని తెలిపారు.

రహదారి నిర్మాణానికి రూ.47.50 లక్షల నష్టపరిహారం అటవీశాఖకు చెల్లిస్తే అనుమతులు ఇస్తామని ఆర్ & బి అధికారులు తెలిపినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఆ నష్టపరిహారం చెల్లించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, సంబంధిత గ్రామపంచాయతీలు తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో నాయకులు గౌరారపు చంద్రశేఖర్, బలుసుపాటి నరేష్, ముతేబోయిన మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


# ఓబీసీ మోర్చా నేతల కీలక సమావేశం

- రాష్ట్ర నాయకులతో కీలక చర్చలు నిర్వహించిన డాక్టర్ కె. లక్ష్మణ్
- ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు ను కలిసిన రాష్ట్ర అధ్యక్షులు సుధమల్ల ఆనంద్ గౌడ్, ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి.

**పెద్దపల్లి బ్యూరో, మే 29 (డిడి9 వార్త):**

హైదరాబాద్‌లో భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్‌ను రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షులు సుధమల్ల ఆనంద్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఓబీసీ మోర్చా బలోపేతం, పార్టీ విస్తరణ, సామాజిక వర్గాల అభ్యున్నతి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులు చర్చించారు. నూతనంగా నియమితులైన రాష్ట్ర కమిటీ సభ్యులకు డాక్టర్ కె. లక్ష్మణ్ అభినందనలు తెలియజేస్తూ, పార్టీ సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

ప్రజా సమస్యలు, ఓబీసీ వర్గాల సంక్షేమ అంశాలపై సమర్థవంతంగా పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన నాయకులకు పిలుపునిచ్చారు.



ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండల అధ్యక్షులు మెరుగు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# వీల్ చైర్ వితరణ

**భద్రాచలం, మే 29 డిడి9 వార్త**

భద్రాచలం పట్టణానికి చెందిన పిలక ధనలక్ష్మికి షుగర్ వ్యాధి కారణంగా కుడికాలు మోకాలు కింది భాగం వరకు తీసివేసారు. ప్రస్తుతం ఉన్న వీల్ చైర్ పాతది కావడంతో తిరగడానికి ఇబ్బందులు పడుతుంది. ఈ విషయం తెలుసుకున్న వస్త్ర వ్యాపారి నీలి దేవి ప్రసాద్ వీల్ చైర్ ను శుక్రవారం దేవస్థానం అధికారుల ద్వారా ఆమెకు తన స్నేహితులైన సాయిబాబా ఆలయ కమిటీ కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు, సమాజ సేవకుడు కడాలి నాగరాజు ఆధ్వర్యంలో అందజేశారు. దేవస్థానం ఏఈఓ శ్రావణ్ కుమార్, సూపరింటెండెంట్ లు కత్తి శ్రీనివాస్, లింగాల సాయిబాబా పాల్గొన్నారు.

# సంస్కృతిక సంప్రదాయ నృత్యాన్ని కాపాడుతున్న నిరోషా

**డిడి9వార్త / వరంగల్ మే 30:**

వరంగల్ శివనగర్ కి చందిన నిరోషా 50 మంది పిల్లలతో కూచిపూడి నృత్య పాఠశాలని నడిపిస్తు కూచిపూడి నృత్యాన్ని పిల్లలకి నేర్పిస్తూ సంప్రదాయ నృత్యాన్ని వెలుగులోకి తీసుకు వస్తుంది. ఇందులో పిల్లల తల్లి తండ్రుల ప్రోత్సహం కూడా ఉండటంతో పిల్లలు అద్భుతమైన నృత్యాన్ని ప్రదర్శిస్తున్నారు.తల్లి తండ్రుల ప్రోత్సహం మెండుగ ఉండడం పిల్లలు కూడా ఎంతో ఇష్టంగా నేర్చుకుంటున్నారు. నిరోషా మాట్లాడుతూ సంప్రదాయ నృత్యం నా ప్రాణం నాతో పాటు చాలా మంది పిల్లలు సంప్రదాయ నృత్యం నేర్చుకోవడం వాళ్ళ వాళ్ళ ఆరోగ్య పరంగా మరియు సంప్రదాయాన్ని కాపాడిన వ్యక్తిగ నాకు సంతృప్తి ఉంటుంది అని అన్నారు.ఇటువంటి సంప్రదాయ నృత్యాన్ని దశ దిశల వ్యాప్తి చెందెల చూడాలని అక్కడి ప్రజలు కోరుకుంటున్నారు.



# జిల్లా ఎస్పీని కలిసిన జె జాక్ కోకన్వీనర్ రామూర్తి

**డీ డీ 9 వార్త, ములుగు :**

ములుగు జిల్లా జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్నాథ్ ను జె జాక్ కోకన్వీనర్ టీ న్యూస్ రిపోర్టర్ పోలోజు రామూర్తి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ములుగు జిల్లా లోని జర్నలిస్ట్ యూనియన్లకు అతీతంగా పాత్రికేయుల సమస్యలపై స్పందించేందుకు జర్నలిస్టులకు జె జాక్ అండగా ఉండి పనిచేస్తుందని ఎస్పీకి ఆయనవివరించారు.

## మద్దిరాల వద్ద రోడ్డు ప్రమాదం ట్రాక్టర్ డ్రైవర్ అర్కల చందు అక్కడికక్కడే మృతి

**డిడి9వార్త / పెద్దపల్లి మే 30:**



పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని మద్దిరాల సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ అర్కల చందు అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. వివరాల్లోకి వెళితే అర్కల చందు వయసు 40 సంవత్సరాలు యాదవ కులం, భార్య స్రవంతి, ఒక కూతురు, ఒక కుమారుడు, మురుమూరు గ్రామానికి చెందిన అర్కల చందు అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్,ఆటో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డాడు.స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, గాయపడిన శ్రీనివాస్‌ను 108 సిబ్బంది గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతిచెందిన అర్కల చందు పార్థీక మృతదేహాన్ని సంబంధిత ప్రభుత్వాసుపత్రికి తరలించడం జరిగింది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## ప్రజల దాహార్తిని తీర్చే దిశగా బీఆర్ఎస్ పార్టీ సభ్యులు

**చర్ల, మే 29 (డిడి 9 వార్త)**

చర్ల మండలం లోని 8 గ్రామ పంచాయతీలలో మొదటి విడతలో భాగంగా శుక్రవారం సుమారు 12 లక్షల రూపాయలతో 8 బోర్లను వేయడం ప్రారంభించారు. అనంతరం కుదునూరు గ్రామంలో స్థానిక సర్పంచ్ కుంజ కమల, ఉప సర్పంచ్ సిద్ధి కిరణ్ కొబ్బరి కాయలు కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆర్.కొత్తగూడెం ఎస్సీ కాలనీలో సర్పంచ్ తురం రవి, గొర్ల రాజబాబు, కూరపాటి వీర్రాజు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. తదనంతరం తిప్పాపురం పంచాయతీలో కారం కన్నారావు కొబ్బరికాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మంచి సమయంలో బోర్లు వేయించిన వద్దిరాజు రవిచంద్రకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు, కో కన్వీనర్ అయినవోలు పవన్ కుమార్, డివిజన్ నాయకులు రాము, యువజన నాయకులు, స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఆదివాసి గ్రామంలో వెలిసిన ఆణిముత్యం..

# తెలంగాణ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన కుంజ. భవాని

- **భద్రాచలం COE కళాశాల విద్యార్థినికి ఘన సన్మానం – చదువే గొప్ప ఆయుధమన్న మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ..**

**మణుగూరు, మే 29 (డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు మండలంలోని మారుమూల ఆదివాసి గ్రామం నుంచి తెలంగాణ రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థిని కుంజ భవాని అందరికీ ఆదర్శంగా నిలిచింది. బుగ్గ పంచాయతీ పరిధిలోని కుంజ లక్ష్మయ్య-కౌసల్య దంపతుల కుమార్తె కుంజ భవాని భద్రాచలం COE కళాశాలలో బైపీసీ ఫస్ట్ ఇయర్‌లో 440 మార్కులకు గాను 438 మార్కులు సాధించి తెలంగాణ స్టేట్ ఫస్ట్ ర్యాంక్‌ను కైవసం చేసుకుంది.

శుక్రవారం నాడు మణుగూరు పట్టణంలోని స్థానిక రాజు కంప్యూటర్స్ ఎడ్యుకేషన్ సొసైటీలో కుంజ భవానిని ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ పాల్గొని విద్యార్థినిని అభినందించారు.

అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. మారుమూల ఆదివాసి గ్రామం నుంచి ఒక విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించడం గ్రామానికే గర్వకారణమని అన్నారు. కష్టపడి చదివితే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని, నేటి సమాజంలో చదువుకంటే గొప్ప ఆయుధం మరొకటి లేదని పేర్కొన్నారు.

“ఒక కోటీశ్వరుడు వంద మంది కోటీశ్వరులను తయారు చేయలేడు. కానీ.ఒక విద్యావంతుడు వంద మంది విద్యవంతుల్ని తయారు చేయగలడు ఒక విద్యావంతుడు సంపాదించిన జ్ఞానాన్ని ఎవరూ దోచుకోలేరు. విద్యే మనిషికి శాశ్వత సంపద” అని ఆమె అన్నారు.

కుంజ భవాని సాధించిన ఈ అరుదైన విజయం ఆదివాసి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతుందని, మరింత మంది ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పలువురు అభిప్రాయపడ్డారు.





# సింగరేణి సీఎండీ అర్జీ-1లో విస్తృత పర్యటన

- **గని ఉత్పత్తి, కార్మిక సంక్షేమం, భద్రతపై సమీక్ష**
- **జీడికే-11 గనిలో కార్మికులతో ముఖాముఖి**
- **కార్మికుల సేవలను అభినందించిన సీఎండీ**
- **GDK-5 ఓపెన్‌కాస్ట్ పనితీరుపై సమీక్ష**
- **అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్**

**పెద్దపల్లి బ్యూరో, మే 29 (డిడి9 వార్త):**

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా. బుద్ధప్రకాశ్ జ్యోతి, రామగుండం1 ఏరియాలో విస్తృతంగా పర్యటించి గనుల ఉత్పత్తి, కార్మిక సంక్షేమం, భద్రతా చర్యలు మరియు కంపెనీ కల్పిస్తున్న సౌకర్యాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు.

పర్యటనలో భాగంగా సీఎండీ జిడికే11 ఇంక్లైన్ గనిని సందర్శించి ఉద్యోగులు, అధికారులు, కార్మికులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి పెంపు, ఉత్పాదకత, నాణ్యత మెరుగుదల, భవిష్యత్ ప్రణాళికలపై చర్చిస్తూ కార్మికుల సూచనలు స్వీకరించారు. సింగరేణి సంస్థకు ఉన్న క్రమశిక్షణ, సమిష్టి పనితత్వమే సంస్థ బలమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గనిలో ఏర్పాటు చేసిన 5వ “మ్యాన్ రైడింగ్ సిస్టమ్”ను సీఎండీ ప్రారంభించారు. ఈ వ్యవస్థ ద్వారా అండర్‌గ్రౌండ్ ప్రాంతాలకు కార్మికులు వేగంగా, సురక్షితంగా చేరుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. దీని వల్ల కార్మికుల శారీరక శ్రమ తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ వ్యవస్థ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఉద్యోగులను అభినందించి సన్మానించారు.డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్. వి. సూర్యనారాయణ మాట్లాడుతూ జీడికే11 గని సింగరేణిలో అత్యధిక మెకనైజేషన్ కలిగిన రెండవ అతిపెద్ద గనిగా నిలిచిందన్నారు. ఆధునిక యంత్రాలను సమర్థవంతంగా వినియోగించి ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని సూచించారు. డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... ప్రస్తుతం ఒక మిలియన్ టన్నుల

# రైతన్నల నిలువు దోపిడీ



- **వెంకటాపూర్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై తీవ్ర విమర్శలు**
- **రైతన్నను మోసం చేస్తున్నారంటూ మండిపడుతున్న రైతులు**
- **క్వింటాలుకు 5 నుండి 10 కిలోల కటింగ్**
- **లక్ష్మీదేవి పేటలో రైతుల నిలువ దోపిడి**
- **కొనుగోలు కేంద్రాలలో గొలుసు కాంటాలే దిక్కు**
- **లారీల పేరుతో బస్తాకు రూ. 10 లు వసూలు**
- **పట్టించుకోని జిల్లా అధికార యంత్రాంగం**
- **ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులపై మండిపడ్డ ఓ మహిళ మాజీ ప్రజా ప్రతినిధి**

**డీ డీ 9 వార్త, ములుగు :**

వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో రైతులపై జరుగుతున్న దోపిడీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులను నిలువునా మోసం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక వడ్ల బస్తాకు రూ.10 చొప్పున అక్రమంగా వసూలు చేస్తున్నారని, కొంతమంది మిల్లర్లు ప్రతి క్వింటాల్‌కు 10 కిలోల వరకు కోతలు విధిస్తూ రైతుల కష్టార్జితాన్ని దోచుకుంటున్నారని రైతులు మండిపడుతున్నారు. ఇలాంటి పరిస్థితి మండలంలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నెలకొన్నగా అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవి పేట గ్రామంలోని ఓ మాజీ మహిళ ప్రజా ప్రతినిధి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులపై మండిపడుతున్నారు. ఆమెతో పాటు గ్రామంలోని రైతులు అక్రమలను అరికట్టాలని జిల్లా అధికార యంత్రాంగానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

పగలు రాత్రి తేడా లేకుండా చెమటోడ్చి పండించిన ధాన్యాన్ని అమ్మడానికి తీసుకువస్తే, కొనుగోలు కేంద్రాల వద్ద ఇలాంటి అక్రమాలు జరగడం దారుణమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు, కూలీల ఖర్చులతో అప్పుల పాలైన రైతులకు ఈ అదనపు భారం మరింత నష్టాన్ని మిగులుస్తోందని వాపోతున్నారు.

కొంతమంది మధ్యవర్తులు మరియు కొనుగోలు నిర్వాహకులు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తక్కువ తూకాలు వేయడం, బస్తాలకు అదనపు చార్జీలు వసూలు చేయడం పూర్తిగా అన్యాయమని రైతులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం ఎన్నో పథకాలు తీసుకొస్తుంటే, కింది స్థాయి సిబ్బంది మాత్రం రైతుల రక్తం పీలుస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాలపై దాడులు నిర్వహించి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రైతుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

“రైతు బతికితేనే దేశం బతుకుతుంది_ _ _రైతునే దోచుకుంటే ఈ సమాజానికి అన్నం ఎవరు పెడతారు? అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతుల గోడును ప్రభుత్వం వెంటనే వినాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.





# పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు..

- **గో టు విలేజ్ కార్యక్రమాన్ని ప్రారంభించిన MRPS మండల అధ్యక్షుడు పొడుతూరి కళ్యాణ్ మాదిగ.**

**మణుగూరు.మే 29 (డి డి 9వార్త)**

పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు గో టు విలేజ్ కార్యక్రమాన్ని శుక్రవారం నాడు మణుగూరు మండల పరిధిలోని బాబూజీ నగర్ గ్రామంలో మణుగూరు మండల MRPS అధ్యక్షుడు పొడుతూరి కళ్యాణ్ బాబు మాదిగ ఆధ్వర్యంలో ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పినపాక నియోజకవర్గ ఇంచార్జి MRPS,MSP జిల్లా సీనియర్ నాయకులు కొమ్ము హుస్సేన్ మాదిగ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడి మధ్యలో చదువు ఆపేసిన పిల్లలను తిరిగి బడులకు,కాలేజీలకు పంపించే విధంగా గ్రామ కమిటీల సభ్యులు ప్రోత్సహించి పిల్లలను పై చదువులు చదివేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని చదువుకోవాలని, చదువు తోనే జీవితాలు బాగుపడతాయని, బంగారు భవిష్యత్తుకు దారులు ఏర్పడతాయని ఆయన తెలిపారు. అలాగే గ్రామాలలో నూతన జెండా దిమ్మెల ఏర్పాటు, నూతన గ్రామ కమిటీల నియామకం తదితర అంశాలపై కూడా చర్చించారు.

ఈ కార్యక్రమంలో MRPS, MSP సీనియర్ నాయకులు ఉసికల కొండయ్య మాదిగ, మహిళా నాయకులు చిట్యాల రజిత,అశోక్, తేజ, రోహిత్,ఠాగూర్,తిరుపతి,రాజబాబు, సందేశ్ కుమార్,మధుప్రియ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీ-1 కార్మిక సమస్యలు పరిష్కరించాలి

- **సింఎండీకి ఏఐటీయూసీ వినతిపత్రం**
- **తాగునీరు, వైద్య సౌకర్యాలపై వినతి**
- **మెటీరియల్ కొరతతో ఉత్పత్తికి ఆటంకం**
- **కార్మిక సంక్షేమంపై యాజమాన్యం స్పందించాలి**



**పెద్దపల్లి బ్యూరో, మే 29 (డిడి9 వార్త):**

సింగరేణి ఆర్జీ1 ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న తాగునీరు, వైద్యం, మెటీరియల్ సరఫరా తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.శుక్రవారం సింగరేణి సి&ఎండీ జ్యోతి బుద్ధ ప్రకాశ్ జీడీకే11 ఇంక్లైన్‌ను సందర్శించిన సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు పూల బొకే అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఆర్జీ1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను మాట్లాడుతూ... రూ.20 కోట్లతో నిర్మిస్తున్న గ్రావిటీ వాటర్ ఫిల్టర్ బెడ్ పనులను త్వరగా పూర్తి చేసి శుద్ధి చేసిన తాగునీరు అందించాలని కోరారు.అలాగే ఏరియా హాస్పిటల్‌లోని క్యాథ్‌ల్యాబ్ బోర్డు పేరును “సింగరేణి క్యాథ్‌ల్యాబ్”గా మార్చాలని, మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ ఉద్యోగాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.గనుల్లో పాత యంత్రాల స్థానంలో కొత్త యంత్రాలు ఏర్పాటు చేయడంతో పాటు, ఓసీపీ5లో కొత్త డంపర్లు, షావెల్స్, లోడర్లు మంజూరు చేయాలని కోరారు. అండర్‌గ్రౌండ్ గనుల్లో డ్రిల్ బిట్లు, రాడ్స్, హ్యాండ్ గ్లౌజులు, నట్ బోల్ట్స్ వంటి మెటీరియల్ సరఫరాను మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. సీఎస్ఆర్ నిధులను ప్రభుత్వ పథకాలకే కాకుండా కార్మిక కాలనీలు, ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి వినియోగించాలని, అన్ని గనులు, డిపార్ట్మెంట్లలో కార్మికుల కోసం కఫ్ బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి సీతారామయ్య, మడ్డి ఎల్లా గౌడ్, మాదన మహేష్, ఎస్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు ఏరియా కు నూతన కార్మికులు రాక..

**మణుగూరు.మే 29 (డి డి 9వార్త)**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు సింగరేణి ఏరియా లో గనులు, డిపార్ట్ మెంట్ లలో ఖాళీలుగా ఉన్న జనరల్ అసిస్టెంట్ పోస్ట్ లను రిక్వెస్ట్ ప్రాతిపదికన భర్తీ చేస్తూ శుక్రవారం నాడు కార్పోరేట్ యాజమాన్యం ఉత్వర్వులు విడుదల చేయడం పట్ల మణుగూరు ఏరియా టి బి జి కె యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వేంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు. మణుగూరు ఏరియా లో గనులు డిపార్ట్ మెంట్ లపై సరిపడా మ్యాన్ పవర్ లేకపోవడం వల్ల నిర్దేశించిన ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాల పై ప్రభావం పడుతుండటంతో పాటు,పనిభారం అధికం అవుతుందనే అంశాన్ని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం పలుమార్లు సంబంధిత అధికారులకు విజ్ఞాపన చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఏరియా లో ఉన్న జనరల్ అసిస్టెంట్ ఖాళీలను భర్తీ చేసేందుకు యాజమాన్యం గడచిన నెలలో ఆసక్తి గల జనరల్ అసిస్టెంట్ ల నుంచి సింగరేణి వ్యాప్తంగా దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని అందులో సీనియారిటీని ప్రామాణికంగా తీసుకొని వివిధ ఏరియాలలో పని చేసే 110 మంది అండర్ గ్రౌండ్ జనరల్ అసిస్టెంట్ లకు ఉపరితల విభాగంలో మణుగూరు ఏరియా కు అవకాశం కల్పిస్తూ యాజమాన్యం ఉత్తర్వులు విడుదల చేయడం సంతోషకరమైన అంశం అని ఆయన పేర్కొన్నారు. మే నెలలో యాజమాన్యం తీసుకున్న నిర్ణయం వల్ల కార్మిక పిల్లల ఉజ్వల భవిష్యత్తు కు ఎంతో మేలు జరుగుతుందని ఆయన తెలిపారు. భూపాలపల్లి ఏరియా నుంచి సుమారు 34 జనరల్ అసిస్టెంట్ లు, రామగుండం 01 నుంచి 20 మంది, రామగుండం 02 నుంచి ఇద్దరు కార్మికులు, కొత్తగూడెం ఏరియా నుంచి ఇద్దరు కార్మికులు, మందమర్రి ఏరియా నుంచి 11 మంది కార్మికులు, శ్రీ రాం పూర్ ఏరియా నుంచి 22 మంది కార్మికులు అడ్రియాల ప్రాజెక్ట్ నుంచి ఇద్దరు కార్మికులకు అవకాశం దక్కగా మణుగూరు ఏరియా లో పని చేసే అండర్ గ్రౌండ్ జనరల్ అసిస్టెంట్ లకు సుమారు 10 మంది కార్మికుల వరకు అవకాశం దక్కినట్టు ఉత్తర్వులు విడుదల చేయడం జరిగిందని ఆయన తెలిపారు. యాజమాన్యం తీసుకున్న నిర్ణయం తో మణుగూరు ఏరియా ప్రగతి కి ఎంతగానో దోహద పడుతుందని ఆయన తెలిపారు. జూన్ 16 వ తేదీ వరకు మణుగూరు ఏరియా లో రిపోర్ట్ చేయాలని యాజమాన్యం సూచించిందని ఆయన తెలిపారు. మణుగూరు ఏరియా లో మ్యాన్ పవర్ కొరతను దృష్టిలో ఉంచుకొని కార్పొరేట్ స్థాయి అధికారులతో మాట్లాడి నివేదికలు తయారు చేసి యువ కార్మికుల ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేసిన మణుగూరు ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామ చందర్ కు, తోడ్పాటు అందించిన ఏరియా అధికారులకు మణుగూరు ఏరియా టి బి జి కె యస్ తరుపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.



# ఉపాధి హామీ కూలీలకు అరటి పండ్లు పంపిణీ చేసిన, మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్

**గోవిందరావుపేట, మే 29 (డిడి 9వార్త)**

మండలంలోని పస్రా గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ గ్రంథాలయ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ అరటి పండ్లు పంపిణీ చేశారు. తీవ్ర ఎండలు, 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు, వడగాలులను సైతం లెక్కచేయకుండా ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన సూచించారు.

ఈ సందర్భంగా గోవింద్ నాయక్ మాట్లాడుతూ.. ఎండ దెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, తరచూ నీరు తాగుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కూలీలకు సూచించారు. గతంలో ఉపాధి హామీ కూలీల కోసం టెంట్లు ఏర్పాటు చేయడం, పనిముట్ల ఖర్చులకు డబ్బులు చెల్లించడం వంటి సౌకర్యాలు కల్పించేవారని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వాటిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.

ఉపాధి హామీ పనులకు వెళ్లే కార్మికులకు తాగునీరు, నీడ, ప్రథమ చికిత్స మందులు వంటి కనీస సౌకర్యాలు కల్పించి వారి ప్రాణాలను రక్షించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మాలోత్ గాంధీ, బానోతు సీతారాం, మాజీ ఎంపీటీసీలు చందులాల్, వెలిశాల స్వరూపతో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పూర్ణచందర్, చెరుకు ప్రవీణ్ కుమార్, వెలిశాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

- **31వ తేదీన బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఉద్యమకారుల సదస్సు**
- **రెడ్డి సంధ్యారెడ్డి పిలుపు**
- **కేకే కేశవరావు కమిటీతో ప్రత్యేక సమావేశం**
- **ములుగు జిల్లా మహిళా ఉద్యమకారులను తరలిరావాలని విజ్ఞప్తి.**

**గోవిందరావుపేట, మే 29 (డి డి 9 వార్త)**

ఈనెల 31వ తేదీ ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరుగనున్న తెలంగాణ ఉద్యమకారుల సభను విజయవంతం చేయాలని, తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర మహిళా కన్వీనర్, ములుగు జిల్లా అధ్యక్షురాలు రెడ్డి సంధ్యారెడ్డి పిలుపునిచ్చారు. కేకే కేశవరావు మరియు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీతో ప్రత్యేక సమావేశం జరుగుతుందని ఆమె తెలిపారు.సంధ్యారెడ్డి మాట్లాడుతూ మహిళా ఉద్యమకారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ములుగు జిల్లా నుంచి మహిళా ఉద్యమ నాయకురాళ్లు, ఉద్యమ జిల్లా కమిటీలు, నియోజకవర్గ కమిటీలు, మండల బాధ్యులు, ముఖ్యంగా మహిళా ఉద్యమకారిణులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆనాడు మహిళలు భాగస్వామ్యం అయ్యారని, ఉద్యమకారులకు హామీల సాధన కోసం జరుగుతున్న నిరంతర పోరాటాలలో కూడా మహిళల పాత్ర ఘనంగా ఉందని ఆమె పేర్కొన్నారు. అనేక కష్టాలు ఎదుర్కొంటూ మహిళలు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని సంధ్యారెడ్డి గుర్తు చేశారు.






# రాష్ట్ర వ్యాప్తంగా రైతన్నల నిలువు దోపిడీ

- పట్టించుకోని అధికారులు
- రైతన్న కన్నీరు ఎవ్వరికీ కనిపించదా
- రైతన్న బతికితేనే రాష్ట్రం బతుకుతుంది.! ముందుగా ధాన్యం కొనండి.!
- రైతన్న ఆవేదనకు ఎవరు బాధ్యులు.?
- మిల్లర్ల దోపిడీకి రైతన్న బలి.! కొనుగోలు కేంద్రాల్లో కష్టాల పరంపర..!!
- రైతన్న కన్నీరు రాష్ట్రానికి అరిష్టం.! వెంటనే ధాన్యం కొనుగోలు చేపట్టాలి.
- తూకం లేదు.. టోకెన్ లేదు.. రైతులకు న్యాయం లేదు.!
- వర్షం పడితే రైతన్న బాధ ఊహించలేం.!
- సామాజిక కార్యకర్త, మేపా జిల్లా నాయకుడు అచ్చునురి కిషన్ ముదిరాజ్

**ములుగు, డీ డీ 9 వార్త :**

తెలంగాణలో రైతు పండించిన ప్రతి గింజ వెనుక చెమట ఉంది. అప్పు ఉంది. ఆశ ఉంది. కానీ అదే రైతు ధాన్యం అమ్ముకునే సమయానికి ప్రభుత్వ అలసత్వం, మిల్లర్ల దోపిడీ, కొనుగోలు కేంద్రాల అవ్యవస్థ అతడిని మళ్లీ రోడ్డున పడేస్తోంది. "రైతే రాజు" అని సభల్లో చెప్పే నాయకులు, కొనుగోలు కేంద్రాల్లో రైతు పడుతున్న బాధను మాత్రం చూడటం లేదని స్పష్టంగా కనిపిస్తుందనీ సామాజిక కార్యకర్త, మెప్పా జిల్లా నాయకులు నాయకులు అచ్చునురి కిషన్ ముదిరాజ్ అన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వానలు, ఎండలు తట్టుకుని పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే రోజులు గడుస్తున్నా తూకం వేయడం లేదు. టోకెన్ల పేరుతో ఆలస్యం చేస్తు, తేమ శాతం పేరుతో కోతలు విధిస్తు, మిల్లర్ల చేతుల్లో దోపిడీకి గురవుతున్నా అన్నదాతలు. ఇదే ప్రస్తుతం తెలంగాణలో రైతులు పరిస్థితి అని చెప్పవచ్చును. ధాన్యం తడిసిపోతే రైతుదే నష్టం, బస్తాలు చినిగినా రైతుదే నష్టం, ట్రాక్టర్లు, లారీల కోసం రోజులు ఎదురు చూసినా ఖర్చు మాత్రం రైతుదే. మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ప్రతి జిల్లాలో వినిపిస్తున్నాయని సామాజిక కార్యకర్త అచ్చులూరి కిషన్ ముదిరాజ్ విమర్శించారు. "నాణ్యత లేదంటూ" క్వింటాల్‌కు కిలోల కొద్దీ కోతలు విధించడం, అధికారుల మౌన సహకారంతో రైతులను వేధించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత లేకపోవడం వల్ల మధ్యవర్తుల దందా మరింత పెరుగుతోందని, అన్నదాతకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం మాత్రం ప్రకటనలకే పరిమితమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోతే అతని కుటుంబం ఆర్థికంగా కుదేలవుతుందని, అప్పులు తీర్చలేక రైతు మానసిక వేదనకు గురవుతున్నాడని, ఇది కేవలం పరిపాలనా వైఫల్యం కాదు, రైతు జీవన హక్కుపై నిర్లక్ష్యం అని చెప్పకనే చెప్పవచ్చును.

ప్రభుత్వం వెంటనే స్పందించి ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి. తేమ, నాణ్యత పేరుతో అనవసర ఇబ్బందులు పెట్టకుండా రైతుకు న్యాయం చేయాలి. కొనుగోలు కేంద్రాల్లో సరిపడ సిబ్బంది, బస్తాలు, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచి, మిల్లర్ల దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతు ధాన్యం కొనుగోలులో ఆలస్యం అంటే రైతు కడుపుపై తన్నినట్టేనని ప్రభుత్వం గుర్తెరగాలి.

అన్నం పెట్టే రైతు కళ్లలో నీళ్లు ఉంటే, రాష్ట్ర అభివృద్ధి గురించి చెప్పుకోవడం వ్యర్థమని, రైతు బాగుంటేనే తెలంగాణ బాగుంటుందని ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం పాలకుల నైతిక బాధ్యత అని చెప్పవచ్చునని కిషన్ ముదిరాజ్ తెలిపారు.

తెలంగాణ నేలపై ఇప్పుడు ఒక విచిత్ర పరిస్థితి కనిపిస్తోంది. నదుల్లో ఇసుక తరలించే లారీలు రాత్రింబవళ్లు పరుగులు తీస్తుంటే, రైతు చెమటతో పండించిన ధాన్యం మాత్రం కొనుగోలు కేంద్రాల వద్ద గుట్టలుగా పేరుకుపోతోందని, ఒకవైపు కోట్ల రూపాయల ఇసుక వ్యాపారం నిరాటంకంగా సాగుతుండగా, మరోవైపు అన్నదాత తన పంట అమ్ముకోలేక ఆవేదనతో కళ్ల నీళ్లు పెట్టుకుంటున్నాడని వాస్తవ దృశ్యాలను చూస్తునే ఉన్నాం. వానలు, అప్పులు, కరెంటు సమస్యలు, ఎరువుల భారం అన్నీ తట్టుకుని రైతు పండించిన ధాన్యం ఇప్పుడు కొనుగోలు కేంద్రాల వద్ద తడిసి ముద్దవుతోందని. రోజులు గడుస్తున్నా తూకం లేదు, టోకెన్ లేదు, మిల్లర్లు స్పందన లేదు, కానీ ఇసుక లారీలకు మాత్రం ఎలాంటి అడ్డంకులు లేకుండా రహదారులు తెరిచి ఉన్నాయని, ఈ పరిస్థితి రైతుల్లో తీవ్ర అసంతృప్తిని రగిలిస్తోందని చెప్పవచ్చును.




"రైతే రాష్ట్రానికి వెన్నెముక" అని చెప్పే ప్రభుత్వాలు, ఆ రైతు పంటను సకాలంలో కొనుగోలు చేయడంలో ఎందుకు విఫలమవుతున్నారని.!? అన్నదాత కష్టానికి విలువ ఇవ్వకుండా, మిల్లర్ల దోపిడీకి అవకాశం కల్పించడం ఏ పరిపాలనా ధోరణి? రైతు ధాన్యం తడిస్తే నష్టం రైతుదే, బస్తాలు చినిగితే నష్టం రైతుదే, తేమ శాతం పేరుతో కోతలు పెట్టినా నష్టపోయేది రైతన్న'నే, చివరకు అప్పులు, ఆవేదన, నిరాశ మాత్రమే రైతు చేతిలో మిగులుతున్నాయని సత్యం అందరికీ తెలిసిందే.

ఈ నేపథ్యంలో రైతు సంఘాలు, ప్రజాసంఘాలు ఒకే డిమాండ్ చేస్తున్నాయి —— "ముందు ధాన్యం కొనుగోలు చేయండి, అవసరమైతే ఇసుక లారీలను తాత్కాలికంగా బంద్ చేయండి." ఎందుకంటే రాష్ట్రానికి ఇసుక కంటే అన్నం ముఖ్యం. నిర్మాణాలు కొన్ని రోజులు ఆగితే మళ్లీ మొదలవుతాయి, కానీ రైతు గుండె ఆగిపోతే ఆ కుటుంబం తిరిగి నిలబడదు అని రాష్ట్ర ప్రభుత్వానికి గుర్తుచేస్తున్నాం.

రైతన్న కన్నీరు కేవలం ఒక కుటుంబ బాధ కాదు, అది సమాజానికి అరిష్టం.! రైతు ఏడిస్తే పల్లె ఏడుస్తుంది.! పల్లె ఏడిస్తే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది.! రైతు ఆవేదనను రాజకీయంగా కాకుండా మానవీయంగా చూడాల్సిన అవసరం పాలకుల'పై ఉందని చెప్పవచ్చు.

**ప్రభుత్వం వెంటనే స్పందించాలి:**

ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలి. కొనుగోలు కేంద్రాల్లో వేగం పెంచాలి. మిల్లర్ల అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలి. రైతులకు తక్షణ చెల్లింపులు చేయాలి. ధాన్యం రవాణాకు ప్రత్యేక ఏర్పాట్లు మెప్పా జిల్లా నాయకులు సామాజిక కార్యకర్త అచ్చునుడి కిషన్ ముదిరాజ్ కోరారు. అన్నం పెట్టే రైతు నిలబడితేనే రాష్ట్రం నిలబడుతుంది.! రైతు గింజకు గౌరవం ఇవ్వని పాలన ఎంత గొప్పగా చెప్పుకున్నా ప్రజల గుండెల్లో నిల్వదని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలి, రైతన్నకు అండగా నిలవాలని కోరుకుంటున్నాను.

